కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా 8లో..

పంచ్‌ఎంట్రీకి పొంచి ఉన్న ప్రమాదం 8లో..



కాల్వశ్రీరాంపూర్‌లో ఆయిల్ పామ్ రైతులతో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



ఓదెల మండలం కొలనూర్‌లో రోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్

రైతులు మీసం మెలేసే రోజులు రావాలి..

తల తెగిపడ్డా ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం..

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- రెవెల్లి ఎస్కేప్ నుంచి హుస్సేనిమియా వాగుకు నీళ్లిస్తాం : మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబు
- పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేస్తాం : మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్
- ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ, రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు, పీహెచ్‌సీ ప్రారంభం

పెద్దపల్లి/కాల్వశ్రీరాంపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైతులు మీసం మెలేసి, కాలు మీద కాలు వేసుకునే రోజులు రావాలని, తల తెగిపడ్డా కూడా వారికి ఇచ్చిన హామీలను నెరువేరుస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లి వద్ద నిర్మించనున్న తిరుమల ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి భూమిపూజ చేశారు. ఓదెల మండలం కొలనూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించగా, ఓదెల-పొత్కపల్లి రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం కాల్వశ్రీరాంపూర్‌లో రైతులతో నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డ్రిప్ రైతులకు, ఆయిల్ పామ్ రైతులకు సబ్సిడీ డబ్బులు ఇవ్వలేదని, అనేక సబ్సిడీ పథకాలను అమలు చేయకుండా జిందా తిలిస్మాత్ మాదిరిగా ఒక్క రైతుబంధు పథకాన్ని చూపి అన్నింటికి ఇదే మందు అని చెప్పిందని ఎద్దేవా చేశారు. లక్ష రూపాయల రుణమాఫీని ఏక కాలంలో చేయలేదని, రెండవ దఫా 22 వేల కోట్లకు 13 కోట్లు మాత్రమే ఇచ్చిందని విమర్శించారు. రైతులకు సబ్సిడీ పథకాలు, గిట్టుబాటు ధరలు గత ప్రభుత్వంలో దక్కలేదని అన్నారు. గత ఎన్నికల్లో రైతులు ఇచ్చిన ధైర్యం, తమపై ఉంచిన విశ్వాసంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. రైతుల అవసరాలు, ఆలోచనలకు తగ్గట్లుగా విద్యుత్, సాగునీరు, సబ్సిడీలు అందిస్తున్నామన్నారు. వరంగల్ సభలో చేసిన రైతు డిక్లరేషన్ మేరకు రైతులకు 2 లక్షల రుణ మాఫీని అమల్లోకి తీసుకవచ్చామన్నారు. రెండో విడతలో లక్షన్నర వరకు ఆగస్టు 15లోపు మూడవ విడతలో 2 లక్షల వరకు రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో జమచేసి రైతుల రుణం తీర్చుకుంటామన్నారు. దేశం అవసరాల కోసం కోటి టన్నుల ఆయిల్ పామ్ అవసరం ఉంటుందని, కానీ 3 లక్షల 98 వేల టన్నులు మాత్రమే వస్తుందని, మిగతాది ఇండోనేషియా, మలేషియా వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. ఆయిల్ పామ్ సాగు వల్ల మూడేళ్లలో పంట కాపునకు వస్తుందని, అప్పటి వరకు అంతర పంటగా మూడు, నాలుగు పంటలను సాగు చేయాలని సూచించారు. ఆయల్ పామ్ సాగుచేసే వారికి మూడేళ్లలో 51 వేల రూపాయల సబ్సిడీ వస్తుందని, ఎకరం పంట సాగు చేస్తే లక్ష రూపాయల వరకు సంపాదించవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ పంటల సాగు వల్ల ఎలాంటి నష్టాలు ఉండవని, తుఫాన్లు వచ్చినా భయం లేదని అన్నారు. స్వయంగా 30 ఏళ్లుగా తాను ఆయిల్ పామ్ చేస్తున్నానని, ఆ పంటపై వస్తున్న ఆదాయంతోనే ఎవరికి చేయి చాపకుండా 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని అన్నారు. ప్రస్తుతం ఇస్తున్న సబ్సిడీని మరింత పెంచాలని ప్రధాని మోదీని కోరామన్నారు. రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటలను సాగు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని, జిల్లాలో ఆయిల్ పామ్ సాగు 10 వేల ఎకరాలకు పెరగాలన్నారు. ప్రజాప్రతినిధులు సైతం ఆయిల్ పామ్ సాగుచేసే రైతులను ప్రోత్సహించాలని మంత్రి తుమ్మల సూచించారు.



కాల్వశ్రీరాంపూర్‌లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన తమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఇది రైతు, ప్రజా ప్రభుత్వం..

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



ఏడాది తర్వాత పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపోను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హామీ ఇచ్చారు. ఈ ప్రభుత్వం రైతు, ప్రజా ప్రభుత్వమని, చెప్పింది చేసి తీరుతామని, తమపై ప్రజలకు విశ్వాసం ఉందని అన్నారు. మే 6వ తేదీన సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ఒక్కటొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 2 లక్షల రుణమాఫిని అమల్లోకి తెచ్చారని, లక్ష వరకు రుణాలను రైతుల ఖాతాల్లో జమ చేశామని, ఆగస్టు 15లోపు మిగతా వాళ్లకు మరో రెండు విడతల్లో పూర్తి చేస్తామన్నారు. ఆయిల్ పామ్ సాగు వల్ల ఎకరానికి లక్ష వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా 64 లక్షల టికెట్లపై మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. ప్రయాణీకుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను పెంచుతామన్నారు. 1700 బస్సులను కొనుగోలు చేయడంతో పాటు ఆర్టీసీలో 3 వేల ఉద్యోగ నియామకాలు చేపడుతున్నామని అన్నారు. పెద్దపల్లిలో బస్ డిపో ఏర్పాటుకు కృషి చేస్తామని, గోదావరిఖని బస్టాండు ఆధునీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

పత్తిపాక రిజర్వాయర్‌ను నిర్మించాలి..



- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు.

పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం చేపడితే ఐదు నియోజకవర్గాల్లోని సుమారు 2 లక్షల 30 వేల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టు భూములు స్థిరీకరణ జరగనున్నదని, మంత్రి ఆదేశాల మేరకు సర్వే కూడా జరుగుతున్నదని, రిజర్వాయర్ నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరుచేయాలని, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చామన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవిలో ఈ రిజర్వాయర్ పూర్తయి హుస్సేనిమియా పరివాహక ప్రాంత రైతులకు రెండు పంటలకు సాగునీరు అందుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో బీఆర్ఎస్ నాయకులు మిల్లర్లతో కుమ్మక్కై క్వింటాలుకు 10 కిలోల వరకు కటింగ్ చేసి రైతులను నిలువు దోపిడీ చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నియోజకవర్గంలో ఒక్క గింజ కటింగ్ లేకుండా మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు పడేటట్టు చేయడం జరిగిందన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో ఏకకాలంలో రుణ మాఫీ జరుగుతున్నదన్నారు. రాబోయే వర్షాకాలం పంటలకు సన్న వడ్లు వేసిన రైతులకు కింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తామన్నారు. అడగగానే పెద్దపల్లిలో బస్సు డిపో ఏర్పాటు హామీ ఇచ్చి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తాను కూడా తమ వ్యవసాయ భూమిలో అయిల్ పామ్ సాగు చేయడంతో పాటు రైతులను కూడా ప్రోత్సహిస్తానన్నారు. అలాగే ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాదరావు, రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్ సింగ్, కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, రామగుండం సీపీ ఎం శ్రీనివాస్, డీసీపీ ఎం చేతన, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, ఆర్‌డీవో గంగయ్య, తిరుమల ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ సీఈవో కేశవ్ కళ్యాణ్‌కర్ తదితరులు పాల్గొన్నారు.

రేవెల్లి ఎస్కేప్ నుంచి సాగు నీరందిస్తాం..



- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రేవెల్లి ఎస్కేప్ నుంచి ఎస్సారెస్పీ నీటిని పెద్దాపూర్ చెరువు ద్వారా హుస్సేనిమియా వాగుకు నీటిని విడుదల చేసేందుకు కృషి చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జిల్లాలో 100 కోట్లతో రైస్ ఆయిల్ బ్రాన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు మంత్రి తుమ్మల హామీ ఇచ్చారని అన్నారు. కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకే గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని, రైతుల రుణ మాఫీ కోసం అప్పులు చేయలేదని, లక్ష రూపాయల రుణ మాఫీని బీఆర్ఎస్ ప్రబుత్వం సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం ముందుకు పోకుండా ఉండేందుకు ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఆర్, బీజేపీ నాయకులు కాళ్లకు కట్టెలు అడ్డు వేస్తున్నారని దుయ్యబట్టారు. వాళ్లు ఎంత అడ్డుకోవాలని చూసినా తమ లక్ష్యం.. తమ వాగ్దానమని అన్నారు. రైతులకు ఒకేసారి రుణ మాఫీ, ఆరు గ్యారంటీ పథకాలు అయ్యేవా, పోయేవా అని విమర్శించారని, వారికి తాము అమలుచేస్తున్న పథకాలే జవాబులని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటివరకు 64 లక్షల టికెట్లపై మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, 500కే వంట గ్యాస్ ఇస్తున్నామని, ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. దేశంలో మరెవ్వరూ చేయని విధంగా ఒకేసారి 2 లక్షల వరకు రుణ మాఫీ చేస్తున్నామన్నారు. లక్ష రూపాయ వరకు బాకీ ఉన్న వారి రుణాలను మాఫీ చేయడంతో రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి తీరుతామని, ప్రతిపక్ష పార్టీల నాయకులు అయోమయానికి గురి కావొద్దని సూచించారు. వారి మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంటున్నాయని, వారిపై ప్రజలు విశ్వాసం కోల్పోయారని అన్నారు. ఈ ప్రాంత రైతులకు, యువతకు మేలు చేసేందుకు 150 కోట్లతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తుండడం శుభసూచకమని అన్నారు.

పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం

● ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



సాయిభార్గవ్‌కు నగదును అందజేస్తున్న అడ్లూరి లక్ష్మణ్, ఆయన సతీమణి కాంతాకుమారి

ధర్మారం, జూలై 19: పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థికంగా అండగా ఉంటానని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ధర్మారంనకు చెందిన పేద విద్యార్థి సాయిభార్గవ్‌కు కోల్‌కత్తాలోని ఖరగ్‌పూర్ ఐఐటీకి ఎంపిక కాగా, ఆర్థికంగా లేకపోవడంతో ధర్మారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆయన సతీమణి కాంతాకుమారి రూ.56వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువుల కోసం ఆర్థికంగా తాము లేమని బాధపడోద్దని తన దృష్టికి తెస్తే వారికి ఆర్థికంగా అండగా ఉంటానని చెప్పారు. సాయిభార్గవ్ లాంటి పేద విద్యార్థి విషయంలో ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేవని తన దృష్టికి తెచ్చారని, అలాగే నియోజకవర్గంలోని ఇతర విద్యార్థుల గురించి వివరిస్తే ఆదుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మార్కెట్ చైర్మన్ రూప్లానాయక్, మార్కెట్ డైరెక్టర్లు కాంపెల్లి రాజేశం, ఈదుల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, కాడె సూర్యానారాయణ, పాలకుర్తి రాజేశం, దేవి అఖిల్, బెక్కం జనార్దన్, మేడవేని తిరుపతి, ఓరెం చిరంజీవి, తాళ్లపల్లి లింగయ్య, పాలకుర్తి సాయివినీత్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షకు 267 మంది హాజరు : డీఈవో

పెద్దపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండవ రోజు డీఎస్సీ పరీక్షకు 267 మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈవో డి మాధవి తెలిపారు. శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ నియామకాల డీఎస్సీ పరీక్షకు మొత్తం 275మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 267మంది అభ్యర్థులు హాజరయ్యారని, మంథని జేఎన్టీయూలో 100మంది అభ్యర్థులకు 99మంది అభ్యర్థులు, పెద్దపల్లిలోని మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో 85మంది అభ్యర్థులకు 81మంది అభ్యర్థులు, ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 90మంది అభ్యర్థులకు 87మంది అభ్యర్థులు హాజర య్యారని తెలిపారు. ప్రతిపరీక్షా కేంద్రంలో విద్యాశాఖపరంగా అబ్జర్వర్, పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశామని, శుక్రవారం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

కోల్‌సిటీ, జూలై 19: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో కోరారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాల దృష్ట్యా నగరంలో పారిశుధ్యంపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామని, కాలువల్లో పూడిక తీతతో పాటు చెత్త తొలగింపు, బ్లీచింగ్, ఫాగింగ్ వంటి చర్యలు చేపడుతున్నామన్నారు. దోమల నివారణకు మురుగునీటి గుంటలు, కుంటల్లో ఆయిల్‌బాల్స్ వేస్తున్నామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చాంబర్లు శిథిలమైన చోట మరమ్మతులు చేయించి కొత్త మూతలు అమర్చుతున్నామన్నారు. మూతలు లేని చాంబర్ల గురించి సమాచారాన్ని కార్పొరేషన్ హెల్ప్‌లైన్ నంబర్ 9603666444కు అందించాలన్నారు. ఇళ్లల్లో మిగిలినపోయిన ఆహార పదార్థాలను బయట పడేయడం వల్ల పందులు, కుక్కలు, దోమలు, ఈగలు పెరిగి అంటు వ్యాధులు వస్తాయని, వాటిని పారిశుధ్య వాహనాలకు అందించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎయిర్ కూలర్లు, టైర్లు, కొబ్బరి చిప్పలలో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- జిల్లా విద్యాధికారి మాధవి

రామగిరి, జూలై 19: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని డీఈవో మాధవి అన్నారు. శుక్రవారం మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బోధన అభ్యాసం పరికరాలు, దృశ్యం ద్వార త్వరగా అర్థం చేసుకుంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు అనేక ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శోభన్‌రావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'గౌరిగుండాల' అభివృద్ధికి చర్యలు

- జలపాతాన్ని సందర్శించిన టూరిజం అధికారులు



గౌరిగుండాల జలపాతాన్ని పరిశీలిస్తున్న టూరిజం అధికారులు

పెద్దపల్లి రూరల్, జూలై 19 : పెద్దపల్లి మండలంలోని సబ్బితం గ్రామపంచాయతీ పరిధిలోని గట్టుసింగారం గౌరిగుండాల జలపాతాన్ని శుక్రవారం హైదరబాద్‌లోని టూరిజం శాఖ మేనేజర్ జీవన్‌రెడ్డి, డీఈ విద్యాసాగర్‌లు గౌరిగుండాల జలపాతాన్ని సందర్శించారు. జలపాతం వద్ద గొల్లబామలు, శివలింగం, వినాయక విగ్రహాలను పరిశీలించి ఫొటోలు తీసుకున్నారు. వారి వెంట మాజీ ఎంపీటీసీ కలవేన మహేందర్, మాజీ సర్పంచ్‌లు చంద శంకర్, చుంచు సదయ్య, కాంగ్రెస్ నాయకులు కందుల అశోక్, గుమ్మడి ప్రసాద్, నూనె రమేష్, కిష్టయ్య, కుమార్, హరీష్‌లతో పాటు గ్రామస్థులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

రామగుండం కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి

కోల్‌సిటీ, జూలై 19: రామగుండం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఏరియా, భరత్‌నగర్, ఎంపీడీఓ ఆఫీస్, తబితా ఆశ్రమ ప్రాంతాల్లో తాగునీటి కొరత తీవ్రంగా ఉందని, దీనిని పరిష్కరించాలని కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌ను కోరారు. శుక్రవారం ఆయనకు వినతి పత్రం అందజేశారు. రామగుండం పట్టణంలో ఎత్తైన ప్రాంతాల్లో నల్లా కనెక్షన్లు ఉన్నాయని, నీరు మాత్రం సరఫరా కావడం లేదు. గతంలో ఎంపీడీవో ఆఫీస్ ప్రాంతంలో సంప్ నిర్మాణానికి ప్రతిపాదన చేసినా పనులు ప్రారంభం కాలేదని, టీయూఎఫ్ఐడీసీ నిధులు కేటాయించి సంప్ నిర్మించాలన్నారు. మల్యాలపల్లిలో మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు.

భవన నిర్మాణ స్థలంలో పేరుకుపోతున్న వరద నీరు

- సమీప కాలనీలకు తప్పని తిప్పలు

కోల్‌సిటీ, జూలై 19: గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో భవన నిర్మాణ పనుల స్థలంలో వరద నీరు పేరుకుపోతోంది. నీరు బయటకు వెళ్లేలా కాంట్రాక్టర్ చర్యలు చేపట్టకపోవడంతో ఐదారు అడుగుల మేర నీరు నిలిచిపోతోంది. దీంతో దిగువన ఉన్న కాలనీల్లోని నివాసాల్లో నీటి ఊటలు వస్తున్నాయి. ఇళ్లలో నుంచి ఊటలు బయటకు రావడంతో కాలనీల వాసులు ఆందోళనకు గురవుతున్నారు. దీనికితోడు రహదారులు బురదమయం అవుతున్నాయి. ఖాళీ ప్లాట్లలో ఈ ఊట నీరుతో నీటి నిల్వలు పేరుకుపోతున్నాయి. దీంతో దోమలు పెరిగి పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై శుక్రవారం నగర పాలక కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు

- శ్రీపాద ఎల్లంపల్లిలోకి వస్తున్న వరద - ఊపందుకున్న వ్యవసాయ పనులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రధానంగా వరినాట్లు జోరుగా పడుతున్నాయి. ఈ వర్షాలతో చెరువులు, కుంటల్లోకి నీళ్లు వస్తున్నాయి. కొన్ని చెరువులు, కుంటలు అలుగు దూకుతున్నాయి. ఎస్సారెస్పీ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లోకి కూడా ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండడంతో రైతుల్లో సాగుపై ఆశలు రేకెత్తుతున్నాయి. రెండు పంటలకు సాగు నీళ్లు అందనున్నాయనే భరోసాతో ఉన్నారు. ఈ సీజన్‌లో జిల్లాలో 2లక్షల 78వేల ఎకరాల్లో వరి,పత్తి, మొక్కజొన్న, వేరుశెనగ, ఇతర పంటలు సాగు కానున్నాయని వ్యవసాయ శాఖాధికారులు అంచనావేశారు. అయితే ఇప్పటివరకు 1,13,551 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. 51,505 ఎకరాల్లో పత్తి, 61,250 ఎకరాల్లో వరి, 601ఎకరాల్లో మొక్కజొన్న, 119ఎకరాల్లో కంది, 16 ఎకరాల్లో ఇతర పంటలు సాగయ్యాయి. గత నాలుగు రోజుల క్రితం వరకు భారీ వర్షాలు కురవపోయినా, ఎలాంటి తుఫాన్లు రాకపోయినా రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వానలు ఒక ప్రాంతంలో ఒక విధంగా, మరొక ప్రాంతంలో మరొక విధంగా కురుస్తున్నాయి. జిల్లా అంతటా పడడంలేదు. జిల్లాలో ప్రధానంగా ఎస్సారెస్పీ ద్వారా పంటలు సాగవుతున్నాయి. కాకతీయ డి-83, డి-86 కాలువల ద్వారా 1,82,699 ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. ఎస్సారెస్పీలో ప్రస్తుతానికి సరిపడా నీళ్లు లేవు. కేవలం వ్యవసాయ బావులు, బోర్ బావుల కింద వరి నాట్లు వేస్తున్నారు. ఎస్సారెస్పీ ఆయకట్టు భూముల్లో నాట్లు వేసేందుకు నార్లు బావుల కిందపోశారు. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటి మట్టం 90 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.82 టీఎంసీలకు చేరుకున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి 17,283 క్యూసెక్కుల వరద వస్తున్నది. జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.29 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.1405క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని గుండారం రిజర్వాయర్ కింద 20 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు భారీ వర్షాలుగా మారే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. ఎస్సారెస్పీలోకి సరిపడా నీళ్లు వస్తే ఆగస్టు 15 కల్లా పూర్తి స్థాయి ఆయకట్టు భూముల్లో వరి నాట్లు పడనున్నాయి.

జిల్లాలో 67.2 మి.మీ. సగటు వర్షపాతం

జిల్లాలో శుక్రవారం ఉదయం వరకు 67.2 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదయ్యింది. అత్యధికంగా మంథని మండలంలో 121.1 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. కమాన్‌పూర్ మండలంలో 88.4 మిల్లీమీటర్లు, రామగిరి మండలంలో 73.2 మిల్లీమీటర్లు, పెద్దపల్లి మండలంలో 71.4 మిల్లీమీటర్లు, ముత్తారం మండలంలో 71.1 మిల్లీ మీటర్లు, అంతర్గాం మండలంలో 70.4 మిల్లీమీటర్లు, రామగుండం మండలంలో 67.8మిల్లీమీటర్లు, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 65.6 మిల్లీమీటర్లు, సుల్తానాబాద్ మండలంలో 61.1 మిల్లీ మీటర్లు, పాలకుర్తి మండలంలో 59.2 మిల్లీమీటర్లు, ఎలిగేడు మండలంలో 56.0 మిల్లీ మీటర్లు, జూలపల్లి మండలంలో 47.5 మిల్లీ మీటర్లు, ధర్మారం మండలంలో 47.4 మిల్లీమీటర్లు, ఓదెల మండలంలో 40.5మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షాలతో మానేరు నది, హుస్సేన్‌మియా వాగు పొంగి పొర్లుతున్నది. చెరువులు, కుంటల్లోకి నీళ్లు వస్తున్నాయి. కొన్ని అలుగులు పారుతున్నాయి. జిల్లా సాధారణ వర్షపాతం 325.0 మిల్లీ మీటర్లు కాగా, ఇప్పటివరకు 405.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ధర్మారం, పాలకుర్తి, రామగుండం, రామగిరి, జూలపల్లి, ఎలిగేడు మండలాల్లో సాధారణ స్థాయిలో వర్షాలు పడగా, అంతర్గాం, కమాన్‌పూర్, పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, మంథని మండలాల్లో సాధారణానికి మించి వర్షాలు పడ్డాయి. ఓదెల, ముత్తారం మండలాల్లో విస్తృతంగా వర్షాలు పడ్డాయి. జిల్లాలో వాతావరణ పరిస్థితులను పరిశీలించినట్లయితే భారీ వర్షాలు కురిసే అవకాశాలు కనబడుతున్నాయి.

పురుగుల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

సైదాపూర్, జూలై 19: సైదాపూర్ మండలంలోని ఎలబోతారం గ్రామానికి చెందిన మొలుగు లచ్చమ్మ(70) అనే వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్థులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం,, ఎలబోతారం గ్రామానికి చెందిన లచ్చమ్మ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు లచ్చమ్మను చికిత్స నిమిత్తం జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతు లచ్చమ్మ మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. దీనిపై ఎస్సై జన్ను ఆరోగ్యంను వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ఎగువ నుంచి ఎస్సారెస్పీకి పెరిగిన వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు పెరుగుతోంది. శుక్రవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాం తాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 17,283 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 16.824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 26.112 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 475 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 10.584 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 1.979 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మహేశ్

చొప్పదండి, జూలై19: చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది, చైర్మన్‌గా కొత్తూరి మహేశ్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, సభ్యులుగా చుప్ప శ్రీనివాస్, పెరుమాండ్ల రవీందర్, ఈర్ల స్వామి, జక్కుల అనిల్ కుమార్, గోస్కుల కొమురెల్లి, పత్తిపాక నరేశ్, వెల్లాల ఆదిరెడ్డి, జాతరకొండ ఓదయ్య, చిలుక సంజీవ్, కొత్తపల్లి నవీన్, యంసాని శంబయ్య, పట్వారి కిషన్‌ను ప్రకటించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాయికల్, జూలై 19: మండలంలోని ధర్మాజీపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు శుక్రవారం రాయికల్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మరొకరుపారిపోయినట్లు తెలిపారు. వీరి నుంచి రూ.8100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. గ్రామాల్లో పేకాట ఆడితే సమాచారం ఇవ్వాలని సూచించారు.

నరసింహుడి ఆలయంలో భక్తుడిపై దాడి

ధర్మపురి, జూలై 19: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఒక భక్తుడిపై ఆలయ ఉద్యోగి, కొందరు కలిసి శుక్రవారం దాడికి పాల్పడ్డాడు. ఆలయ నిత్యాన్నదాన సత్రంలో ఒక భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నాడు. బియ్యం దొడ్డుగా ఉన్నట్లు ఉద్యోగులతో పాటు వంట తయారీ చేసిన వ్యక్తిని అడిగినట్లు సమాచారం. అయితే తమకు ఏమి తెలియదని ఈవో ఆఫీస్‌లో ఫిర్యాదు చేయమని భక్తుడికి తెలియసేసినట్లు తెలుస్తోంది. ఉద్యోగి అన్నదానం ప్రదేశానికి రావడం వల్ల భక్తుడు దొడ్డు బియ్యం గురించి అతనికి వివరించారు. అనంతరం ఉద్యోగి పేరు, హోదా గురించి ప్రశ్నించాడు. వెంటనే ఆ ఉద్యోగి ఆఫీస్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని చెప్పి వెళ్లినట్లు సమాచారం. భక్తుడు ఈవో కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయగా ఆ ఉద్యోగికి భక్తుడికి తీవ్ర వాదోపవాదాలు జరిగినట్లు తెలిసింది. భక్తుడి కుటుంబ సభ్యులతో కలిసి ఆఫీస్ నుండి కింది రాగా ఆలయ ఆవరణలో కుటుంబ సభ్యుల సమక్షంలో భక్తుడిని ఉద్యోగి సహా మరి కొందరు కొట్టినట్లు తెలిసింది. ఈ విషయమై ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నం చేయగా అందుబాటులో లేరు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- గ్రామాభివృద్ధి పేరుతో వేలం పాటలు
- పట్టించుకోని అధికారులు



ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

మల్లాపూర్, జూలై 19: మల్లాపూర్ మండలంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. అనుమతులు లేకుండా ఇష్టారీతిన ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేయడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు ఇసుక రవాణాను అడ్డుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల అభివృద్ధి పేరిట వీడీసీలు గ్రామంలో కూల్ డ్రింక్, పెట్రోల్, డీజిల్, చికెన్ విక్రయాలు చేయడానికి, ఇసుక, మట్టిని తరలించడానికి వ్యాపారం చేసుకోవడానికి వేలం పాటలు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో అక్రమ వ్యాపారస్థులు రెచ్చిపోతున్నారు. గోదావరి పరివాహక గ్రామాల్లో దొరికే ఇసుక అక్రమ రవాణాదారులకు వరంగా మారింది. ఇక్కడి నుంచి పట్టణ ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను వ్యాపారులు అక్రమంగా తరలించడమే దందాగా మార్చుకొని సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక అధికారులు కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో ఇసుక రవాణాకు ఎలాంటి అడ్డూ అదుపు లేకుండా సాగుతోందని స్థానికుల చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక మాఫీయా ఆగడాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జమ్మికుంట, జూలై 19: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తండా ఉండాలని జమ్మికుంట టౌన్ సీఐ రవి అన్నారు. మండలంలోని శాయంపేట గ్రామంలో గ్రామస్థులకు సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దన్నారు. అలాగే యువత చెడు మార్గంలో వెళ్లకుండా ఉండాలన్నారు. డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత లక్ష్యం కోసం క్రమశిక్షణతో చదవాలని సూచించారు. చదువుతోనే జీవితంలో ఉన్నత స్థానం దక్కుతుందని చెప్పారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, అలా ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



శాయంపేటలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవి

పేదలకు సంక్షేమ పథకాలు అందజేయాలి

» ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూలై 19: అర్హులైన పేదలకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందేలా, పథకాలు అమలయ్యేలా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్, జిల్లా ఎస్పీలు, ఇతర అధికారులు పారదర్శకంగా పనిచేయాలని రాష్ట్ర సాగునీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా రైతు భరోసా అమలుపై మంత్రివర్గ ఉపసంఘం రైతుల నుంచి అభిప్రాయాల సేకరణకు హాజరయ్యేందుకు శుక్రవారం ఉదయం ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కరీంనగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కొంతసేపు విశ్రాంతి తీసుకుని ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సుడా చైర్మన్, జిల్లా అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ప్రత్యేకంగా కలెక్టర్లు, సీపీ, ఎస్పీల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. పేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పనితీరును మంత్రులు ప్రశంసించారు. 60 శాతం పైగా భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులే వస్తున్నా యని సీపీ అభిషేక్ మొహంతి మంత్రుల దృష్టికి తీసుకురాగా బాధితు లకు న్యాయం అందించేలా పారదర్శక చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇదే విధంగా ముందుకుసాగాలన్నారు. న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని భరోసా ఇచ్చారు.

● ఎమ్మెల్యేలతో కూడా మంత్రులు కొద్దిసేపు మాట్లాడి నియో జకవ ర్గాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాన కొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ని యోజకవర్గాల పరిధిలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులతోపాటు ఇంది రమ్మ ఇళ్లు, స్థానికంగా నెలకొన్న సమస్యలను మంత్రులు దృష్టికి తీసు కువచ్చారు. వీటన్నిటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని మంత్రు లు హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ శివారు ప్రాంతాల్లో భూకబ్జాలు అధికమయ్యాయని, పేదలు, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమా వేశంలో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లా కలెక్టర్లు, కరీంనగర్ పోలీస్‌కమిషనర్, జగిత్యాల, సిరిసిల్ల ఎస్పీలు, అడిషనల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

● కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని పౌరసరఫరాలశాఖ అధికారులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు ఉమ్మడి జిల్లాలో ఆయా శాఖల పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నవోదయ ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి, జూలై 19: నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరా నికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మం గతాయారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు కరీంనగర్ జిల్లాలో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతూ ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా ఉమ్మడి జిల్లాలో నివసిస్తూ ఉండాలని ఆమె తెలిపారు. సెప్టెంబరు 16లోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డిపో మేనేజర్లు బాధ్యతల స్వీకరణ



ఈడీ వినోద్‌కుమార్‌కు పూలమొక్కను అందజేస్తున్న డిపో మేనేజర్లు

భగత్‌నగర్, జూలై 19: నూతనంగా నియమితులైన మంథని, వేములవాడ, సిరిసిల్ల డిపో మేనేజర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పదోన్నతి పై మంథని, వేములవాడ, సిరిసిల్ల డిపోలకు మేనేజర్లుగా నియమితులైన వీఎస్ కుమార్, బి శ్రీనివాస్, ఎ ప్రకాశ్‌రావు బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం, హెడ్ ఆఫీస్, మెహదీపట్నంలో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్)గా పనిచేస్తున్న వారు డిపో మేనేజర్లుగా పదోన్నతి పొందారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి వినోద్‌కుమార్, రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత, డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెకానికల్) కె సత్యనారాయణ, డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎం చంద్ర య్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

తెలంగాణకు అన్యాయం

» రాష్ట్ర విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలి

» సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 19: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీలు అమలు కాకపోవడంతో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీలు అమలు అంశాలను ప్రవేశపెట్టాలని చెప్పారు. పునర్విభజన చట్టంలోని హామీల అమలుపై తెలంగాణకు చెందిన కేంద్రమంత్రులు స్పందించాల న్నారు. చట్టంలోని అంశాలు అమలు కాక తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన యూనివర్సిటీ, వెనుకబడిన జిల్లాల అభివృ ద్ధికి ప్రత్యేక నిధులు, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని విభజన హామీల్లో ఉన్నప్పటికీ అమలు చేయలే ద న్నారు. ఆంధ్రప్రదేశ్ లో పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చా రని, తెలంగాణ ప్రాజెక్టుకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం లో ముఖ్య మంత్రిగా కేసీఆర్ అనేక తప్పులు చేశారని ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును విస్మరించారని చెప్పారు. ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ ప్రాణ హిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఐ ఆధ్వ ర్యంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు దశల వారీగా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రానికి సంబంధించి సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని నిలిపి వేయాలన్నారు. వేలం వేసే అంశంపై తీవ్రంగా చర్చ జరుగుతుందని, వేలం వేస్తే ప్రైవేటీకరణ చేసినట్లే అవుతుం దని, సింగరేణిని ప్రైవేటీకరణ చేయనని చెప్పిన మోదీ పచ్చి అబద్ధాల కోరనే విషయం అర్థమయిం దన్నారు. 27వ తేదీన గ్లోబల్ టెండర్లు పిలుస్తున్నందున తక్షణమే టెండర్లు రద్దుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ప్రక్రియను ప్రారంభించిం దన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించకుండా రుణమాఫీ చేయాలని, బ్యాంకుల్లో సమస్యలు తలెత్తకుండా పూర్తిగా రుణమాఫీ చేయాలన్నారు. రైతు భరోసా ఇప్పటి వరకు ఇవ్వలేదని తక్షణమే చెల్లించాలన్నారు. ఎకరానికి 7,500 ఇస్తామని హామీ ఇచ్చారని సంవత్సరానికి 15 వేలు ఇవ్వాలని, ధాన్యానికి 500 బోనస్ ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా పేదలకు అన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ఇస్తామని చెప్పిందని అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరుచేయాలన్నారు. ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. రేషన్ కార్డులు లేక పదేళ్ల పాటుప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధిహామీ కూలీలకు వారానికి ఒకసారి కూలీ డబ్బులు చెల్లించాలని సూచిం చారు. సీఎం రేవంత్‌రెడ్డి పారదర్శకపాలన అందించాల న్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుపై సీపీఐ నాయకత్వం, ప్రజా సంఘాలు కిం ది స్థాయి వరకు పరిశీలించి ప్రజలకు అందే విధంగా చూస్తామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలుపెట్టుకున్నా రని వాటన్నిం టిని అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో నాయకులు పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, గూడెం లక్ష్మి, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, కిన్నెర మల్లవ్వ, నలువాల సదానందం, బామండ్లపల్లి యుగేందర్, బోనగిరి మహేందర్, నల్లగొండ శ్రీనివాస్, కృష్ణ యాదవ్ తది తరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట జూలై 19: కోనరావుపేట మండలం మర్తన్‌పేట గ్రామానికి చెందిన జవ్వాజి శేఖర్ అనే గీత కార్మికుడు తాడిచెట్టు పైనుంచి పడగా గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం కల్లు తీయడానికి చెట్టు ఎక్కు తుండగా ప్రమాదవశాత్తుకింద పడిపోయాడు. గాయా లైన శేఖర్‌ను తోటి కార్మికులు వెంటనే సిరిసిల్ల ఆస్పత్రికి తరలిం చారు.

41 మంది మందుబాబులకు జరిమానా

తంగళ్లపల్లి, జూలై 19: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారితోపాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 41 మందికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఉదయశ్రీ జరిమానా విధించినట్లు తంగళ్లపల్లి ఎస్సై సుధాకర్ తెలిపారు. తం గళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వివరాలు వెల్లడిం చారు. తంగళ్లపల్లి మండలంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 23 మందిని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి 18 మందిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.2 వేలు, తొమ్మిది మందికి రూ. 1,500, 11 మందికి రూ.1000, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 18 మందికి రూ.210 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గొల్లపల్లిలో వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డిపేట, జూలై 19: ఎల్లారెడ్డిపేట మండలం గొల్ల పల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహ దారిపై సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యం లోని పోలీసులు శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని 25 మంది వాహ నదారులకు జరిమానా విధించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాల న్నారు. వాహన పత్రాలు లేకుండా నడిపితే సీజ్ చేస్తా మని హెచ్చరించారు.

కొండచిలువ కలకలం



పొలంలో కనిపించిన కొండచిలువ

గంభీరావుపేట, జూలై 19: గంభీరావు పేట సమీపాన ఓ రైతు పొలంలో కొండచిలువ కనిపించడం కలకలం రేగింది. మల్యాల రాజువీర్‌కు చెందిన పొలంలో శుక్రవారం కొండచిలువను రైతు గమనించారు. వ్యవసాయ పనుల్లో ఉన్న ఆ రైతు కొండ చిలువ చూసి భయంతో వణికిపోయాడు. అతడు కేక లు వేయడంతో సమీప పొలాల్లో ఉన్న రైతులు అక్కడికి చేరుకునే సరికి కొండచిలువ వెళ్లిపోయింది. దీంతో సమీ ప ప్రాంతాల్లో పొలాలు ఉన్న రైతులు భయాందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రుద్రంగి, జూలై 19: రుద్రంగి మండల కేంద్రం శివారులోని గంగమ్మ గుడి వద్ద ఆర్టీసీ బస్సును వెనుక నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగా యాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగిలోని గంగమ్మ గుడి వద్ద ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న బైక్ బస్సు ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న పండుల శ్రీనివాస్‌కు స్వల్పగాయాలయ్యాయి. శ్రీని వాస్ భార్య మాధవికి తీవ్రగాయాలయ్యాయి. శ్రీనివాస్, మాధవిని వేముల వాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై అశోక్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎస్‌యూ ఎం ఫార్మసీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూలై 19: శాతవాహన విద్యాలయంలో మే 2024లో నిర్వహించిన ఎం ఫార్మసీ ఒకటో, మూడో సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌యూ.ఏసీ.ఇన్. అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బైకును ఢీ కొట్టిన వ్యక్తిపై కేసు నమోదు

బీర్‌పూర్, జూలై 19: ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులను అజాగ్రత్తతో ట్రాక్టర్ నడిపి వాహనాన్ని ఢీ కిట్టిన వ్యక్తిపై శుక్రవారం కేసు నమో దు చేసినట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గురువారం దొంతాపూర్ గ్రామానికి చెందిన సర్గా లక్ష్మన్ అతడి భార్య జమున తమ ద్విచక్ర వాహనంపై దొంతాపూర్ నుంచి జగిత్యాలకు వెలుతున్నారు. నర్సింహులపల్లి గ్రామ శివారులో సూరపాక తిరుపతి బీర్‌పూర్ గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ నడుపుతూ వారి మోటర్‌సైకిల్‌ను ఢీ కొట్టాడు. దీంతో పై ఇద్దరికి గాయా లయ్యాయి. వరుసకు కొడుకైన సర్గా సాయికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ధర్మారం, జూలై 19: ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామంలో తండ్రి మందలిం చాడని పురుగుల మందు తాగి ఆత్మాహత్యా యత్నం చేసిన నేరేళ్ల మహేష్ (26) అనే యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు.. ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నేరేళ్ల భూమయ్య కొడుకైన మహేష్ ఇటీవల తనకు సెల్ ఫోన్, బైక్ కొనివ్వాలని, లేదంటే తను చనిపోతానని తండ్రిని బెదిరించాడు. దీంతో తండ్రి సెల్‌ఫోన్, బైక్ కొనిచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 17న తొలి ఏకాదశి సందర్భంగా పండగపూట తండ్రి కొడుకును ఊరికే బైక్ మీద తిరగకు, రోజులు బాగా లేవని మందలించాడు. మనస్తాపానికి గురైన మహేష్ ఇంటి వెనకాల పురుగుల మందు తాగి పడిపోయాడు.. గమనించిన కుటుంబ సభ్యులు వైద్య చికిత్సల నిమిత్తం హుటాహుటిన కరీంనగర్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహేష్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగిన వృద్ధుడు..

సుల్తానాబాద్, జూలై 19: సుల్తానాబాద్ మండలంలోని రేగడి మద్దికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన సుద్దాల కొమురయ్య అలియాస్ చిక్కుడు కొమురయ్య (63) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొమురయ్య తన ఇంట్లో గురువారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని మల్లయ్య పల్లి గ్రామానికి శుక్రవారం సాయంత్రం తీసుకువచ్చారు. కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు గుంటల భూమి కోసం మరదలిని హత్యచేసిన బావ

- నాలుగు రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు

గంగాధర, జూలై 19: ఆరుగుంటల భూమి పంచి ఇవ్వడంలేదని కక్ష పెంచుకుని సొంత భార్య చెల్లిని హత్య చేసిన నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గర్షకుర్తికి చెందిన చిందం మాధవి ఈనెల 15న అనుమానాస్పదంగా మృతి చెందిందని ఆమె మేన మామ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మాధవి కొన్ని రోజులుగా తమ మాటవినకుండా యువకుడితో సన్నిహితంగా ఉంటుందని, తమకు రావాల్సిన గర్షకుర్తిలోని 6 గుంటల భూమి పంచి ఇవ్వడంలేదని బావ గుండ అంజనేయులు, అక్క గుండ మానసలు కక్ష పెంచుకు న్నారు. ఈక్రమంలో ఏలాగైనా మాధవి అడ్డుతొలగించుకుని భూమిని కాజేయాలని అంజనేయులు ఈనెల 14 గర్షకుర్తికి వచ్చాడు. ఇంటిలో మాధవి ఒంటరిగా ఉండగా భూమి విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో కోపోద్రేకుడైన అంజనేయులు తన మాట వినడంలేదని చున్నీతో మాధవి మెడకు బిగించి చంపివేశాడు. అనంతరం ఎవ్వరికి అనుమానం రాకుండా ఇంట్లోని ఫ్యానుకు ఉరి వేరివేసుకున్నట్లు వేలాడదీశాడు. అనుమానం రాకుండా స్వగ్రామం తిమ్మాపూర్ మండలం నుస్తులాప ూర్‌కు వెళ్లి తన భార్య మానసకు విషయం చెప్పాడు. అయితే అనుమానాస్పదకేసు నమోదు చేసిన ఎస్‌ఐ కిరణ్‌రెడ్డి వివిధ కోణాల్లో విచారించారు. అంజనేయులు, మానసలు నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితులను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్‌ఐ కిరణ్‌రెడ్డితో పాటు పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

గంజాయికి అలవాటుపడి..పెడ్లర్‌గా మారి..

● గంజాయి సరఫరా చేస్తున్న బీటెక్ విద్యార్థి
● మరో ఐదుగురితో కలిసి గంజాయి సేవిస్తుండగా పట్టుబడిన వైనం
● 150 గ్రాముల గంజాయి స్వాధీనం..కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, జూలై 19: గంజాయికి అలవాటుపడిన ఓ బీటెక్ విద్యార్థి డ్రగ్ పెడ్లర్‌గా మారాడు. ఈ క్రమంలో గం జాయి సేవిస్తుండగా అతడితో పాటు మరో ఐదు గురు విద్యా ర్థులను పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇబ్రహీం పట్నం టౌన్‌లో ఓ ప్రైవేటు హాస్టల్‌పై నార్కోటిక్ బృందం, ఇబ్రహీంపట్నం పోలీసులు గురువారం రాత్రి సం యుక్తంగా దాడులు చేసి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకు న్నారు. గంజాయి సరఫరాదారుడితో కలిపి ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ఇందులో గంజాయి సరఫరాదారుడు పరారీ లో ఉన్నారు. సీఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ టౌన్‌కు చెందిన శ్రీ రాముల సాత్విక్ (21) ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజ నీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ.. ఇక్కడ ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నాడు. కాగా, అతనికి సిరిసిల్ల సమీపంలోని ఇల్లంతకుంటకు చెందిన నవీన్(25)తో పరిచయం ఏర్పడింది. నవీన్ భద్రాచలం ఏజెన్సీ ఏరియా నుంచి గంజాయిని తీసుకొచ్చి సాత్విక్‌కు సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో గంజాయికి అలవాటుపడిన సాత్విక్ పెడ్లర్‌గా మారి ఇబ్రహీంపట్నం పరిసరాల్లో చదువుతున్న విద్యార్థులకు గంజాయి పాకెట్లను విక్రయిస్తున్నాడు. ఇదే క్రమంలో తాను చదువుతున్న కళాశాలలోనే బీటెక్ విద్యార్థులు నూకల సంప త్‌నాయుడు (20), ఓ మైనర్, స్వయంపాకుల కార్తీక్ (20)ల తోపాటు నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఓ కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తున్న పడాల వంశీ(20), దంపేట గణేష్ (21)లతో పరిచయం పెంచుకున్నాడు. నవీన్ మిన హా పై ఆరుగురు ఇబ్రహీంపట్నంలోని ఓ హాస్టల్‌లో గంజాయి సేవిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు.. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో నార్కోటిక్ బృందం, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. కాగా, సాత్విక్‌పై ఇదే విషయంలో మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో కూడా గతంలో ఓ కేసు నమోదైంది. నవీన్‌పై మీర్‌పేట్‌లో ఓ కేసు, సిరిసిల్లలో మూడు కేసులున్నాయి. ఈ మేరకు వీరిపై కేసులు నమోదు చేశామని, గంజాయి అమ్మకందారైన సాత్విక్‌ను రిమాండ్‌కు పంపినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మరో నిందితుడు నవీన్ పరారీలో ఉన్నట్లు చెప్పారు.

అటవీశాఖలో అధికారుల బదిలీలు

సిరిసిల్ల క్రైం , జూలై 19: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలువ ురు అటవీశాఖ అధికారులు శుక్రవారం బదిలీ అయ్యారు. 3 సంవత్సరాల కంటే ఎక్కువ ఒకే చోట పనిచేసిన సెక్షన్ అధికా రులు, బీట్ అధికారులకు బదిలీ తప్పలేదు. సిరిసిల్ల సెక్ష న్ అధికారి భూలక్ష్మీ సిరిసిల్ల స్ట్రైకింగ్ ఫోర్స్ సెక్షన్ అధికారిగా, గంగాధర డిప్యూటీ రేంజ్ అధికారిగా బాపిరాజు, వెంకటాపూర్ డిప్యూటీ రేంజ్ అధికారిగా మోహన్ లాల్ , శ్రవణ్‌కుమార్‌కు సిరిసిల్ల సెక్షన్ అధికారిగా, బీట్ అధికారులుగా వి సతీష్ (అల్మాస్‌పూర్), లావణ్య (గర్జనపల్లి), వసుమతి (పెద్ద లింగాపూర్)కు బదిలీ అయ్యారు. వీరందరూ జీవో నెంబర్ 18 ప్రకారం ఈ నెల 21న రిలీవ్ కావాల్సి ఉంది.

పోస్టర్ల ఆవిష్కరణ

సుభాష్‌నగర్, జూలై 19: నాస్తిక సమాజం మూడో మహాసభల పోస్టర్లను శుక్రవారం భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు అధ్యక్షుడు ఉప్పలేటి నరేష్ కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుకొండలోని వడ్డేపల్లి పీఆర్‌రెడ్డి భవన్‌లో ఈనెల 24న మహాసభను నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. సమాజంలో కుల, మత, మూఢనమ్మకాల నిర్మూలన కోసం కృషి చేస్తున్న నాస్తిక సమాజం 52 సంవత్సరాలుగా ప్రజలకు ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు జాతీయ స్థాయిలో అనేక రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం హనుమకొండలో నిర్వహిస్తున్నామని నాస్తికులు సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

హుజూరాబాద్, జూలై 19: హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని శుక్రవారం కాయకల్ప అవార్డు బృందం సభ్యులు డాక్టర్ హరిప్రియ, క్వాలిటీ మేనేజర్ సురేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్‌ఎంవో సుధాకర్‌రావు, ఏవో నారాయణరెడ్డిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా ఆస్పత్రిని ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం ఉన్నందున సీజనల్ వ్యాధులు ప్రబల కుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరాలు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శాకాంబరీ అవతారంలో వాసవీమాత



కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కోరుట్ల, జూలై 19: పట్టణంలోని వాసవీ దేవాలయంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారు శాకాంబరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వేదపండితుడు పాలెపు రాంశర్మ మత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. వివిధ కూరగాయలతో అమ్మవారికి అలకరించి పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక కంకుమపూజ కార్యక్ర మాన్ని నిర్వహించచారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. విష్ణు, లలిత సహస్ర నామ పారాయణం జరిపి గోరింటాకు వేడుకలను నిర్వహించారు. కార్యక్ర మంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు రాజేంధ్రప్రసాద్, సంతోష్, శ్రీకాంత్ పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజ్

సుభాష్‌నగర్, జూలై 19: చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ఈ నెల 30,31 తేదీల్లో తలపెట్టిన చలో ఢిల్లీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబరు 1 నుంచి 10 వరకు కొడంగల్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని, అంబేద్కర్ అభయహస్తం కింద రూ. 12లక్షలు ప్రతి మాదిగ కుటుంబానికి ప్రభుత్వం ఇవ్వాలని, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని, పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మాదిగ సంఘాల ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కెటాయించాలని, వికలాంగులకు రూ. 7వేల పింఛన్ ఇవ్వాలని, సదా లక్ష్మమ్మ విగ్రహాన్ని టాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, డప్పు కొట్టే మాదిగలకు రూ. 5వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య, కార్యదర్శి మాచారం మాసయ్య, ఉమ్మడి జిల్లా ఇంచార్జీ కనకం రవి, జిల్లా అధ్యక్షుడు రమాగిరి సారయ్య, బొడ్డు లక్ష్మన్, సంటి గణేశ్, ఖమ్మం కృష్ణ, మాట్ల రాజ్‌కుమార్, మాతంగి కుమారస్వామి, సందేల దేవయ్య, సుంకపాక దేవరాజు, దాల్లపల్లి లక్ష్మన్, అరికిల్ల గణపతి, ఖమ్మం కుమారస్వామి, ఎన్నగందుల శ్రీకాంత్, కనకం రాజు తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా అధ్యక్షుడిగా మాట్ల రాజ్‌కుమార్

టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మాట్ల రాజ్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికి రాజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని పరిష్కరించాలి

- వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్



మాట్లాడుతున్న వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్

సిరిసిల్ల రూరల్, జూలై 19: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలని మాట్లాడుతున్న వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో శుక్రవారం జేఏసీ నాయకుల సమావేశం సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలల్లో నెలకొన్న విద్యుత్ ఇతర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారిం చాలంటూ ఈ నెల 22 నుంచి సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిలేనిరహారదీక్షలను చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. దీక్షలను కొనసాగిస్తూనే 22న సోమవారం వంటావార్పు కార్యక్రమంతో ప్రారంభించి 23న రాస్తారోకో, 24న పట్టణ బంద్‌కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే 25న చలో హైదారాబాద్ కార్యక్రమాన్ని చేపట్టి అసెంబ్లీని ముట్టడిం చేందుకు రూపకల్పన చేశామని వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అడెపు భాస్కర్, ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ఏఐటీయూసీ లాల్‌బావుటా చేనేత పవర్‌లూం కార్మిక సంఘం కార్యదర్శి పంతం రవి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభంతోపాటు సమస్యలను పరిష్కారించాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి పలుమార్లు వివిధ రూపాల్లో తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేక పోవడంతో జేఏసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాలను కార్మికులు, ఆసాముల విజయవంతం చేయాలని కోరా రు. సమావేశంలో సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఆసాముల సంఘం నాయకులు గోనేపర్శరాముల, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శి అంకాలపు రవి, పోలు శంకర్, కట్టెకోల లక్ష్మీనారా యణ, కోడం అశోక్, పిస్క మధు, ఏనుగుల ఎల్లయ్య, గోవిందు రవి, దూడం శంకర్, గాజుల నారాయణ, దూసభూమయ్య, మండల సత్యం, వెల్దండి దేవదాస్, మోర రాజు, కళ్యాడపు సుభాష్, బోద్దుల సుదర్శన్, బండారి అశోక్, బూట్ల నవీన్, బూర కనుకరాజు, దూడం రమేష్, గం గుల శ్రీనివాస్, కోడం శ్రీనివాస్, మండల బాలరాజు, శ్రీరాం సత్యం, హనుమండ్ల రామనారాయణ, బోడ్డు శ్రీధర్, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.



పంచ్‌ఎంట్రీకి పొంచి ఉన్న ప్రమాదం

- రూఫ్ జంక్షన్ వద్ద భారీ రంధ్రం
- గనిలోకి చేరుతున్న వరద నీరు



ఏఎల్‌పీ పంచ్‌ఎంట్రీ (ఫైల్)

రామగిరి, జూలై 19: సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీ పంచ్‌ఎంట్రీలోని సెకండ్ చైర్ లిఫ్ట్ జంక్షన్ వద్ద భారీ ప్రమాదం పొంచి ఉంది. గురువారం అర్ధరాత్రి సెకండ్ షిఫ్టులో 42వ పోల్ చైర్ లిఫ్ట్ జంక్షన్ వద్ద భారీ రంధ్రం ఏర్పడింది. అందులోంచి భారీగా వరద నీరు గనిలోకి చేరుకుంటోంది. ఈ సమాచారం అందుకున్న అధికారులు హుటాహుటిన చైర్ లిఫ్ట్‌ను నిలిపివేసి గనిలోకి వెళ్లి పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇదే కొనసాగితే వరద నీరు పెద్ద ఎత్తున గనిలోకి చేరుకొని రూఫ్ పెద్దమొత్తంలో కూలిపోయే అవకాశం ఉందని కార్మికులు చర్చించుకుంటున్నారు. రూఫ్‌కు హోల్ పడడానికి ప్రధానంగా అధికారుల తీరు కారణంగా తెలుస్తోంది. ఉత్పత్తికి లక్ష్యాలను చూపించడం కోసం గని కింద నుంచి కాకుండా రూఫ్‌కు సమాంతరంగా ఉన్న బొగ్గు నిల్వలను తొలగించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వరద నీటికి రూఫ్ నానిపోయి పెద్ద రంధ్ర ఏర్పడానికి ఆస్కారం అయిందని తెలిసింది. కాగా, రూఫ్ హోల్ కంటే ముందు ఉన్న మరో మార్గంలో కార్మికులను పని స్థలాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. వరద నీటిని అరికట్టేందుకు అధికారులు చర్యల్లో నిమగ్నం కాగా, కార్మికుల్లో ఆందోళనలు నెలకొన్నాయి.

సుల్తానాబాద్ ఆసుపత్రి వైద్యుడి బదిలీ

సుల్తానాబాద్, జూలై 19: సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ శ్రీరామ్ హుస్నాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు సుల్తానాబాద్‌లో ఆయన రిలీవ్ అయ్యారు. కొవిడ్‌లో డాక్టర్ శ్రీరామ్ సుల్తానాబాద్, పెద్దపల్లి అసుపత్రిలలో విశిష్ట సేవలందించారు. దాదాపు నాలుగేళ్లుగా ఆయన సుల్తానాబాద్ ఆసుపత్రిలో సేవ లందించారు.

బాధ్యతల స్వీకరణ

రామగిరి, జూలై 19: మండలంలోని కల్వచర్ల పల్లెదవాఖానకు వైద్యుడిగా దేవెందర్‌రెడ్డి గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వైద్యపరమైన ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా తమ దృష్టికి తీసుకరావాలని గ్రామస్తులను కోరారు. వర్షం కాలంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మహిళల రక్షణే షీ టీం లక్ష్యం

కోల్‌సిటీటౌన్, జూలై 19: విద్యార్థినులు, యువతులు, మహిళల రక్షణే షీ టీం ప్రధాన లక్ష్యమని ఎస్సై రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం గోదావరిఖని కృష్ణవేణివికాస్ జూనియర్ కళాశాలలో షీటీమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు షీటీమ్ పనితీరు, అందించే సేవలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకన్న, షీటీమ్ సిబ్బంది స్నేహలత, సురేష్, విద్యార్థినులు పాల్గొన్నారు.

చెన్నూర్ ఎమ్మెల్యేకు సన్మానం

సుల్తానాబాద్, జూలై 19: పెద్దపల్లి మాజీ ఎంపీ, ప్రస్తుత మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని సుల్తానాబాద్‌లో సన్మానించారు. చెన్నూరు నియోజకవర్గ పర్యటనకు వెళుతున్న వివేక్‌ను కాంగ్రెస్ యువజన నాయకులు గంగుల సంతోష్, కొలిపాక సంపత్, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు కలువల శ్రీనివాస్ తదితరులు సుల్తానాబాద్ లో ఆపారు. ఆయనకు శాలువాలతో సన్మానం చేశారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

పెద్దపల్లి రూరల్, జూలై 19 : గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పెద్దపల్లి ఎంపీవో సుదర్శన్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లిలో గల వీధుల్లో మురుగునీరు నిల్వకుండా చర్యలు చేపట్టడంతో పాటు దోమల నివారణకు మురుగు కాలువల వెంట బ్లీచింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఓదెల, జూలై 19 : మండల కేంద్రానికి చెందిన ఆకుల సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాగా, శుక్రవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. సాంబయ్య మృతిపై అతని కుమారుడు,మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్‌ను అడిగి తెలుసుకొని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంట రాములు, బీఆర్ఎస్ నాయకులు ఐరెడ్డి వెంకటరెడ్డి, కనికిరెడ్డి సతీష్, బుద్దె పోశెట్టి, బోడకుంట సతీష్, చింతం మొగిలి, తీర్థాల కుమార్, మ్యాడగొని శ్రీకాంత్, బోడకుంట మహేందర్, గడ్డం శ్యామ్ పాల్గొన్నారు.

చెరువులు, కుంటలకు జలకళ..

పెద్దపల్లి రూరల్, జూలై 19 : రెండు రోజులుగా పెద్దపల్లి మండలంలో కురుస్తున్న వర్షాలకు కుంటలు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. మండలంలోని భోజన్నపేట మాటుకుంట చెరువు రెండు రోజుల క్రితం నీరు లేక ఉండగా రెండు రోజుల వర్షానికి నిండుకుండలా కనిపిస్తోంది.

ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రులు

ఓదెల, జూలై 19 : మండలంలోని కొలనూర్‌లో రూ.1.56 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావులు కలిసి ప్రారంభించారు. అలాగే 13.30 కోట్ల నిధులతో నిర్మించిన కొలనూర్, ఓదెల బీటీ రోడ్డును ఆర్భాటంగా ప్రారంభించారు. అంతకుముందు కొలనూర్‌కు చేరుకున్న మంత్రులను కలెక్టర్ కోయ శ్రీహర్ష స్వాగతం పలికి ప్రారంభోత్సవాలకు ఆహ్వానించారు. వర్షాల కారణంగా మంత్రులు హెలిక్యాప్టర్ ప్రయాణాన్ని రద్దు చేసుకొని రోడ్డు మార్గాన పర్యటన కొనసాగించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టారు. అలాగే మండలంలోని కాంగ్రెస్ నేతలు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, అళ్ల సుమన్‌రెడ్డి, బైరి రవిగౌడ్‌తో పాటు పలువురు నాయకులు మంత్రులకు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు తానిపర్తి భానుప్రసాదరావు, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్, డీసీపీ చేతన, ఏసీపీ గజ్జికృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఆర్డీవో గంగయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 19: సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా జరిగింది. హెచ్ఎంఎస్, ఏఐఎఫ్‌టీయూ, ఇఫ్టూ, సింగరేణి ఉద్యోగుల సంఘం, టీఎన్‌టీయూసీల నాయకులు బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా ధర్నా చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలోని నాలుగు బొగ్గు బ్లాక్‌లను కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తున్నదని, దీన్ని అడ్డుకునేందుకు జేఏసీగా ఏర్పడి ఆందోళనలు చేస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. గెలిచిన సంఘాలు వేలం ప్రక్రియను అడ్డుకునే చర్యలు చేపట్టడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలోని గనులను సింగరేణికి కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈధర్నాలో రియాజ్ అహ్మద్, ఐ కృష్ణ, కొంరయ్య, రాములు, ఈ రాజేందర్, దావు రమేష్ పాల్గొన్నారు.



ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

జనరల్ క్వార్టర్ల కేటాయింపులో ఇబ్బందులు

గోదావరిఖని, జూలై 19: జనరల్ క్వార్టర్ల కేటాయింపు ఆలస్యంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. గోదావరిఖనిలో రోడ్డు వెడల్పులో భాగంగా హనుమాన్‌నగర్, శివాజీనగర్, అశోక్‌నగర్ ఏరియాల్లో క్వార్టర్ల కూల్చివేతకు యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికీ మూడుసార్లు స్పెషల్ క్యాటగిరి కింద క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించినప్పటికీ కొంత మంది పాల్గొనడంలేదు. దీంతో యాజమాన్యం గురువారం మూడోసారి 140క్వార్టర్లకు ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ కౌన్సెలింగ్ నిర్వహించారు. కొంత మంది క్వార్టర్లు మంచిగా లేవంటూ క్వార్టర్లను తీసుకోలేదు. దీంతో ప్రతి నెల జరిగే జనరల్ క్వార్టర్ల కేటాయింపు ఆలస్యం జరగడంపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనరల్ క్వార్టర్ల కేటాయింపు ఇప్పటికే రెండుసార్లు వాయిదాపడింది. తమకు క్వార్టర్లు కేటాయించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గురువారం సెక్టార్-1 పరిధిలో వివిధ ఏరియాల్లో ఉన్న 140క్వార్టర్లకు యాజమాన్యం కౌన్సెలింగ్‌కు పిలిచింది. ఇందులో కొంత మంది క్వార్టర్లు తీసుకోకుండా మెలికలు పెట్టడంతోపాటు క్వార్టర్లు బాగాలేవని, తాము తీసుకోమంటూ మొండికేశారు. వారం రోజుల క్రితం తొలగించాలని నోటీసులు ఇచ్చిన క్వార్టర్లకు విద్యుత్ కనెక్షన్‌లను తొలగించింది. కోర్టు ఉత్తర్వులతో విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరించి 15రోజుల్లో క్వార్టర్లు ఖాళీ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కాగా కొంత మంది మాత్రం క్వార్టర్లు ఖాళీ చేస్తున్నారు.

మృతిచెందిన కార్మికులకు నివాళులు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 19: ఓసీపీ-2 ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు కార్మికులకు శుక్రవారం ఓసీపీ-1 కార్మికులు నివాళులు అర్పించారు. సైటాఫీస్, బేస్‌వర్క్‌షాప్‌లలో జరిగిన సంతాప కార్యక్రమాల్లో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కాగా సింగరేణిలో ప్రమాదాల నివారణకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమాల్లో యూనియన్ నాయకులు, ఆయా సెక్షన్‌ల కార్మికులు పాల్గొన్నారు.

రామగిరి, జూలై 19: సింగరేణి ఆర్జీ-3 ఓసీపీ-2 ప్రమాదంలో మృతి చెందిన ఉప్పు వెంకటేశ్వర్లు, గాదం విద్యాసాగర్‌కు శుక్రవారం ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో రెండు నిమిషాల పాటు మౌనం పాటిస్తూ సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



బేస్‌వర్క్‌షాప్‌లో నివాళులు అర్పిస్తున్న కార్మికులు

గనుల్లో భద్రతను పెంచుతాం

- రక్షణ త్రైపాక్షిక సమావేశంలో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్



సమావేశంలో పాల్గొన్న అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గనుల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతను పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ప్రకటించారు. దీనికోసం కార్మిక సంఘాలు చేసిన సూచనలన్నీ పరిగణనలోకి తీసుకుంటామన్నారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన 48వ రక్షణ త్రైపాక్షిక సమీక్ష సమావేశం జరిగింది. దీనికి గుర్తింపు, ప్రాతినిధ్య కార్మికసంఘాల ప్రతినిధులు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్‌సేఫ్టీ అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశం గుర్తింపు కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జనరల్ సెక్రటరీ వి. సీతారామయ్య అధ్యక్షతన జరిగింది. ఇందులో బలరామ్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉత్పత్తిలో ఆదర్శంగా ఉందని, అలాగే రక్షణలో కూడా ప్రమాద రహిత కంపెనీగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతీ కార్మికుని ప్రాణాలు ఎంతో విలువైన వని, ప్రాణనష్టం జరగకుండా, ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, యాజమాన్యంతోపాటు కార్మికులు కూడా రక్షణ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కోరారు. చాలా ప్రమాదాలు నిర్లక్ష్యం, నిర్లిప్తత వల్లే చోటు చేసుకుంటున్నాయని విచారం వ్యక్తం చేశారు. రక్షణ లేని పని ప్రదేశాల్లో విధులు నిర్వర్తించాలని యాజమాన్యం ఎప్పుడూ ఒత్తిడి చేయబోదని, అదే సమయంలో ప్రతీ ఒక్కరూ కూడా స్వీయ రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా గనుల్లో రక్షణ పెంపుదలకు కార్మిక సంఘాలు అనేక సూచనలు చేశాయి, నాణ్యమైన హెల్మెట్లు, బూట్లు సరఫరా చేయాలని, వైద్య సేవలు పెంపుదల, క్యాంటీన్లలో మెరుగైన సౌకర్యాలు, కొత్త యంత్రాల కొనుగోలు, ఆధునికీకరణ, అవసరమైన సిబ్బంది నియామకం వంటి అనేక అంశాలపై గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్, ఇతర నాయకులు అనేక సూచనలు చేశారు. డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ రీజియన్- 2 ఎన్.నాగేశ్వరరావు, ఇతర డీజీఎంఎస్ అధికారులు సింగరేణి వ్యాప్తంగా రక్షణ పెంపుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అంతకు ముందు ఇటీవల పలు ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికులకు సంతాపం ప్రకటించారు.

పంటపొలాల్లోకి ఓసీపీ-2 ఓబీ మట్టి

- అన్నారం బ్యాక్ వాటర్ ముంపు పొలాలను పరిశీలించిన అధికారులు



కన్నాల గ్రామంలో రైతుల పంటపొలాల్లోకి చేరిన ఓసీపీ-2 మట్టి



అన్నారం బ్యారేజీ బ్యాక్‌వాటర్ ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

మంథని, జూలై 19: రెండు రోజులుగా మంథని ప్రాంతంలో గురువారం రాత్రి, శుక్రవారం మధ్యాహ్నం పలు మార్లు భారీ వర్షం కురిసింది. దాదాపు 10సె.మీ వర్షం పాతం నమోదైంది. దీంతో పట్టణంలోని, గ్రామాల్లోని డ్రైనేజీలు, రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మంథని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ చెరువును తలపించింది. చెరువులు, కుంటలు నిండాయి. గోదావరి, మానేరు నదులు,పట్టణ శివారులోని బొక్కలవాగు వరదనీటితో నిండుగా ప్రవహిస్తున్నాయి. వర్షంతో జనం సతమతమయ్యారు. పలు మార్లు కరెంట్‌కు అంతరాయం ఏర్పడింది. కొంచెం ఆలస్యమైన కూడా వర్షాలు బాగా కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంటల పొలాల్లో చేరిన ఓసీపీ-2 ఓబీ మట్టి

గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి సింగరేణి ఆర్జీ-3 ఓసీపీ-2 మట్టి కుప్పల నుంచి భారీగా వరద రావడంతో మండలంలోని కన్నాల గ్రామానికి చెందిన పలువురు రైతుల పంట పొలాలు దెబ్బతిన్నాయి. వరదనీటితో గ్రామానికి చెందిన రైతులు గుడిసె రాజయ్య, రాజ్‌కుమార్, అశోక్, సంపత్, వీరయ్య, మల్లారెడ్డితోపాటు 15 మంది రైతులు ఓబీ మట్టితో తమ పంట పొలాల్లో చేరి వరినాట్లు దెబ్బతిందని శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఓసీపీ-2 యాజమాన్యం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని, లేకుంటే సింగరేణికి సంబంధించిన లారీలను ఎట్టి పరిస్థితుల్లో గ్రామాల్లో తిరగనీయకుండా అడ్డుకుంటామని వెల్లడించారు. మూడు రోజుల క్రితమే నాటు పెట్టిన దాదాపు 30 ఎకరాల వరకు సింగరేణి నుంచి వచ్చే వరద నీటితో మట్టి దిబ్బలు పొలాలపైన పేరుకుపోయాయని, దాంతో నష్టం ఏర్పడిందన్నారు. గతంలో ఎన్నోసార్లు యాజమాన్యానికి విన్నవించుకున్న కూడా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నారం ముంపు పొలాలను పరిశీలించిన అధికారులు

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్నారం బ్యారేజీ బ్యాక్‌వాటర్ కారణంగా ముంపుకు గురవుతున్న మండలంలోని ఆరెంద, మల్లారం గ్రామాల పంట పొలాలను అన్నారం బ్యారేజీ ఎస్ఈ, ఈఈ, డీఈలు శుక్రవారం పరిశీలించారు. రైతుల పంటలు బ్యారేజీ బ్యాక్‌వాటర్ కారణంగా ముంపునకు గురికాకుండా ఉండేలా శాశ్వత చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల రైతులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరగా ఆయన ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు ముంపు పంట పొలాలను పరిశీలించినట్లు మంథని సింగిల్‌విండో డైరెక్టర్ రావికంటి సతీష్ తెలిపారు. పంటల రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యల పై బ్యారేజీ ఇంజనీరింగ్ అధికారులు సమాలోచనలు చేస్తున్నట్లు వెల్లడించారు.

మంత్రులకు వినతుల వెల్లువ

కాల్వశ్రీరాంపూర్, జూలై 19: అక్రిడిటేషన్ కార్డులు గల జర్నలిస్టులందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్ రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కోరారు. శుక్రవారం కాల్వశ్రీరాంపూర్ మండలకేంద్రంలో జరిగిన ఆయిల్ పామ్ రైతుల సభకు హాజరైన మంత్రికి ఆయన వినతిపత్రం అందజేశారు. అక్రిడిటేషన్ కార్డులు గల జర్నలిస్టులందరికీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. బాలె శివప్రసాద్, సొన్నాయి టెంకం చంద్రమౌళి, రావి కోటేశ్వర్లు ఆర్ మృత్యుంజయం, గుడ్ల శ్రీనివాస్, అనంతరెడ్డి, శ్రీమంతుల కొండల్, రావి మధుకర్, వీరగోని రమేష్, మేకల మల్లేష్, సదానం దం, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానికత ఆధారంగా సర్దుబాటు చేయాలి...

బీఆర్ఎస్ ప్రభుత్వం జారీచేసిన జీఓ 317వల్ల ఎంతోమంది ఉపాధ్యాయ, ఉద్యోగులు నష్టపోయారని 317జీఓ బాధిత ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షులు కూరపాటి సత్యప్రకాష్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం కాల్వ శ్రీరాంపూర్‌లో జరిగిన సమావేశానికి విచ్చేసిన 317జీవో ఉప సంఘం సభ్యులైన పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబులను కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. కార్యక్రమంలో 317జీవో బాధిత ఉపాధ్యాయులు డింగరి రవికుమార్, పీ జ్యోత్స్న, బీ వెంకటస్వామి, జీ రాజమౌళి, సీహెచ్ ఏసు, ఈ కిషన్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

కాంట్రాక్ట్ రెండవ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. 16సంవత్సరాలుగా పని చేస్తున్నామని, ఇప్పటి వరకు రెగ్యులర్ చేయలేదని ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఏఎన్‌ఎంలతో సమానంగా పనిచేయడంతో పాటు కొన్ని సబ్‌సెంటర్లలో రెగ్యులర్ ఏఎన్‌ఎం లేకుండా తామే పని చేస్తున్నామని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులర్ చేసేలా చూడాలని మంత్రి శ్రీధర్‌బాబుకు విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏఎన్‌ఎంలు సునీత, సరోజన, కవిత, పద్మ, సరిత, శైలజ ఉన్నారు. అలాగే మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చినట్లు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ తెలిపారు. కాల్వశ్రీరాంపూర్‌లో 30పడకల ఆసుపత్రి, కునారం వ్యవసాయ పరిశోధన స్థానంలో అగ్రికల్చరల్ బీఎస్సీ కళాశాల ఏర్పాటు, హైదరాబాద్, హన్మకొండ, వేములవాడకు వెళ్లేందుకు బస్సులు, తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవన నిర్మాణానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్లకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య ఉన్నారు.

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

పెద్దపల్లిటౌన్, జూలై 19: కల్లు గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల రవీందర్ గౌడ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెట్టు మీద నుంచి ప్రమాదవశాత్తు పడి మరణించిన, శాశ్వతంగ వికలాంగులైన వారికి ఎక్స్‌గ్రేషియాను 10 లక్షల రూపాయలకు పెంచాలని కోరారు. గీత కార్మికులకు ఐదు వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని కోరారు. గీత కార్మికులకు ఇవ్వవలసిన ఎక్స్‌గ్రేషియా డబ్బులను వెంటనే రిలీజ్ చేయాలన్నారు. గ్రూప్ సొసైటీలు దరఖాస్తు చేసుకున్న వారందరికీ బీసీ కార్పొరేషన్ ద్వారా రుణం ఇవ్వాలని సూచించారు. తాటి, ఈత చెట్ల పెంపకానికి ప్రతీ సొసైటీకి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని కోరారు. బీసీ కార్పొరేషన్ ద్వారా బైక్‌లు ఇవ్వాలని కోరారు. గీత కార్మికుల కుటుంబాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

'కేశోరాం'లో వన మహోత్సవం

పాలకుర్తి, జూలై 19: మండలం పరిధిలోని బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెనీ మైన్స్‌లో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ సంవత్సరం ఇక్కడ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 2000 మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా మొదటి రోజు 500 మొక్కలను నాటారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ గజేంద్రప్రసాద్ సాహూ, జీఎం సుదర్శన్ రెడ్డి, ఏజీఎం ముజాహిద్ ఖాన్, ఫోర్‌మెన్ బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-3లో ఘనంగా బోనాల ఉత్సవం



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 19: ఓసీపీ-3 రిలే బీ కార్మికులు శుక్రవారం బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ళు, పోతరాజుల నృత్యాల మధ్య కాలనీ నుండి కృషిభవన్ వరకు శోభయాత్ర నిర్వహించారు. ఈశోభయాత్రలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఎమ్మెల్యే బోనం ఎత్తుకుని పాల్గొన్నారు. అనంతరం కార్మికులతో కలసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సుల్తానాబాద్, జూలై 19: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అఫీసర్ డాక్టర్ అనుదీప్, డాక్టర్ ఫరహమక్ నూన్ ప్రజలకు సూచించారు. మండలంలోని కాట్నపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్థులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి మలేరియా, డెంగ్యూ, రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరెడ్డి, ఏఎన్‌ఎం కవిత, భారతి, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీకార్యదర్శి శంకర్, పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్ల పంపిణీ

కళ్యాణ్‌నగర్, జూలై 19: గోదావరిఖని స్ఫూర్తి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రావికంటి శశిధర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్ఫూర్తి, జ్యోతిగాంధీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50మంది పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయ ప్రకాష్‌చౌద మాట్లాడుతూ కరోనా కాలంలో మున్సిపల్ కార్మికులు అందించిన సేవలు మరువలేనివని, తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనులు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో గుంత వినోద్, నార్ల ప్రసాద్, మామిడిపెల్లి శ్రీధర్, ప్రవీణ్, దయానంద్ గాంధీ, నటరాజ్ రాజశేఖర్, గోపాల్‌రావు, అజిమ్, మల్లికార్జున్, సురేష్, ప్రసాద్, కిరణ్, మున్సిపల్ సూపర్‌వైజర్ దయానంద్ పాల్గొన్నారు.

భౌతిక శాస్త్ర అధ్యాపకుడికి వర్క్‌షాప్‌నకు ఆహ్వానం

రామగిరి, జూలై 19: మండలంలోని సెంటినరీకాలనీ వాణి పాఠశాలకు చెందిన భౌతికశాస్త్ర అధ్యాపకుడు దూసి కౌండిన్యకు కేంద్ర శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన పరిషత్ రీజనల్ హెడ్ క్వార్టర్స్ బెంగళూరు వారి ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించే అధ్యాపకుల వర్క్‌షాప్‌నకు ఆహ్వానం అందింది. భౌతిక శాస్త్రన్ని ఆటలు- బొమ్మల సహాయంతో సులువుగా బోధించే పద్ధతులపై జూనియర్ లెక్చరర్లకు శిక్షణ కల్పించనున్నారు. అదే అంశంపై 25, 26 తేదీల్లో చెన్నైలో నిర్వహించనున్న ఉపాధ్యాయుల వర్క్‌షాప్‌నకు కూడా శిక్షకుడిగా వ్యవహరించనున్నారు. వర్క్‌షాప్‌నకు ఆహ్వానం రావడంపై హర్షం ప్రకటిస్తూ పాఠశాల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రావణ్‌కుమార్ అభినందించారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లిటౌన్, జూలై 19: బూతులు తిడుతూ కులం పేరుతో దూషించి దాడి చేసిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన జాడి తిరుపతి కోరాడు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 10న గ్రామంలో గట్టు పంచాయతీ సమయంలో కొత్తపల్లి గ్రామానికే చెందిన బండి సతీష్ కులం పేరుతో తిట్టి కొట్టాడని వాపోయాడు. దీనిపై ఈనెల 11న బసంత్ నగర్ పోలీసులకు పిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నాడు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు. వెంట జాడి నర్సయ్య, జాడి రాజు, బోరుకుంట్ల వెంకటేష్ ఉన్నారు.

ఉత్సాహంగా బోనాల వేడుకలు

జూలపల్లి, జులై 19. మండలంలోని కాచాపూర్ గ్రామంలో గల శ్రీసాయి వివేకానంద ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం బోనాల ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలంగాణ ప్రజలు సాంప్రదాయంగా నిర్వహించుకుంటున్న అతిపెద్ద పండుగ బోనాల వేడుకలు కావడంతో వాటిపై చిన్నారి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోతరాజు వేషాదారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్శరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రులకు ఘన స్వాగతం



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సుల్తానాబాద్, జూలై 19: పలువురు రాష్ట్ర మంత్రుల పెద్దపల్లి నియోజకవర్గ పర్యటనను పురస్కరించుకుని సుల్తానాబాద్‌లో ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాదరావు, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెద్దరాతుపల్లి వద్ద నిర్మించనున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ శంకుస్థాపన కార్యక్రమానికి వెళ్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులకు సుల్తానాబాద్ ఐబీ చౌరస్తా వద్ద ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే, విజయ రమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాదరావు మంత్రులకు పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో సత్కరించారు. సర్పంచ్ ఫోరం ఉమ్మ డి జిల్లా మాజీ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్, మాజీ సర్పంచ్ పుష్పలత తదితరు లు మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సన్మానించారు. అనంతరం మంత్రుల వాహనంలో వారు కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలంలోని కార్యక్రమాల కోసం వెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, దామోదర్‌రావు, పన్నాల రాములు, పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీష్, పట్టణ అధ్యక్షులు అబ్బయ్య గౌడ్, దామోదర్‌రావు, దుగ్యాల సంతోష్‌రావు, సాయిరి మహేందర్, కల్లెపల్లి జానీ, కలువల శ్రీనివాస్, అమిరిశెట్టి రాజలింగం, పల్లా సురేష్, పోచాలు అమీనొద్దిన్, మోబిన్, ఫారుఖ్ పాల్గొన్నారు.